ఉరి

— జి. పరిమళా సోమేశ్వర్

"గణ గణమంటూ చర్చి బెల్లు పన్నెండు గంటలు కొట్టింది.

ఆ ధ్వని తరంగాలు చీకటిని చీల్చుకుని చెట్లమీదుగా, యిళ్ళ కప్పుల మీదుగా ప్రయాణంచేస్తూ రంగయ్య గుడిసెలోకికూడా ప్రవేశించి అతని చెవులగుండా పోయి గుండె 'ఝుల్లు'మనేట్లు చేసినయ్.

ఆ గగుర్పాటుకు అతని రోమాలన్నీ నిక్కబొడుచుకున్నయ్, అతని కాళ్లూ చేతులూ చల్లగా అయిన ట్లనిపించింది.

గుడిసె మధ్య వెలుగుతున్న కిరసనాయిలు బుడ్డి వెదజల్లే గుడ్డి వెలుతురులో అతని కళ్ళు నిప్పుకణికల్లా మెరుస్తున్నయ్.

అతని పెదవులు ఎన్ని నెలలుగానో నీటి చుక్క నెరుగక పగిలి బీటలువారిన నల్ల రేగడి నేలలోని మట్టి బెడ్డల్లా ఉన్నయ్.

అసలే వికృతంగా, మోటుగావున్న అతని ముఖం భయంతో, అనేక రకాల సందేహాలతో, ఆవేదనతో మరింత భయంకరంగా తయారయింది.

కిరసనాయిలు బుడ్డీనుంచి వొచ్చే మసక వెలుతురు తాలూకు నీడలు అతని ముఖంమీద అటూయిటూ ఊగుతూ అతని ముఖానికి ఒక వింత ఆకృతిని, దానిమీద గల భావముద్రకు ఒక విలక్షణమైన అర్థాన్ని యిస్తున్నయ్.

గుడిసెలో ఒక మూల ఎండిన గోగివుల్లలావున్న అతని భార్య రత్తి కాళ్ళు ముడుచుకుని పడుకుంది. అమాయకంగా అలసట తీరేలా నిద్రపోతున్న రత్తి ముఖం చూస్తుంటే రంగయ్య గుండె ద్రవించి పోతోంది.

రోజూ తనుకూడా అంత నిశ్చలంగా ఆదమరచి నిద్రపోయేవాడు. కాని సాయంత్రం జైలు వార్డెను చెప్పిన సంగతి విన్న దగ్గరనుండీ తనక నిద్రాహారాల మీదనే విరక్తి కలిగింది. "తెల్లవారు జామున నాలుగు గంటలకల్లా పనిపూర్తి చేసేయ్యాలి. ఓ గంట ముందుగానే అక్కడ సిద్దంగా ఉండాలి" అది వార్డెను ఆజ్ఞ!

ఆ ఆజ్ఞ పిడుగులా అతని గుండెను తాకింది. ఆ మాట విన్నదగ్గిర నుండి రంగయ్య మనసు మనసులోలేదు. రంగయ్య సెంట్రల్ జైలులో 'హాంగ్‌మన్'గా పనిచేస్తున్నాడు. అతనీ ఉద్యోగంలోకి చేరి పట్టుమని రెండేళ్ళుకూడా కాలేదు. అంతకుముందు రాళ్ళు మొయ్యటం, ఇళ్ళు కట్టేటప్పుడు యిటుకలు సిమెంటు అందించటం పెద్ద పెద్ద భవనాలకు సున్నం వెయ్యటం మొదలయిన పనులు చేస్తూండేవాడు రంగయ్య. రత్తి అక్కడా యిక్కడా పాచి పనిచేస్తూండేది.

కాని రత్తి రోగిష్టిదవటంవల్ల ఏ ఇంట్లోనూ వరసగా నెలరోజుల పాటు నిలకడగా పని చెయ్యగలిగేదికాదు" చీటికీ మాటికీ నాగాలు పెట్టే రత్తిని ఏ గృహిణీ పనిలోకి పెట్టుకుంటానికి ఒప్పుకునేదికాదు. ఇటు రంగయ్యకుకూడా రోజూ తప్పకుండా పని దొరుకుతుందన్న గ్యారంటీ లేదు. అందుకే నెలలో కనీసం పదిరోజులన్నా పస్తులుండేవారు ఆ దంపతులు.

అలాటి సమయంలోనే సెంట్రల్ జైలులో హాంగ్‌మన్ ఉద్యోగానికి ఖాళీ ఉందని తెలిసి దరఖాసు పెట్టుకున్నాడు రంగయ్య.

తీరా ఉద్యోగం దొరికిన తరువాత తను చెయ్యవలసిన పనేమిటో తెలుసుకుని గజగజ వణికిపోయేడు రంగయ్య. "ఖూనీలుచేసిన నేరస్థులను ఉరి తీయటమే నీ పని" అని జైలు అధికారులు చెప్పినప్పుడు అతనికి కళ్ళు తిరిగి పడిపోయినంత పనయింది.

"పస్తులన్నా ఉంటాను కానీ, యిలాంటి పాపపు పనులు మాత్రం చెయ్యను" అనుకున్నాడు.

కాని ఆ జైలులో పనిచేసే చప్రాసీలు అతనికి అభయమిచ్చేరు. "పేరుకు మాత్రమే నీకీ డ్యూటీ నిజంగా ఉరి తీయవలసిన అవసరం నీకు ఎన్నడూ రాదు ఈ రోజుల్లో చాలావరకు ఆజన్మాంతర ఖైదును విధిస్తున్నారేగాని ఎంతటి నేరస్థులకయినా ఉరి శిక్ష అనేది పడటంలేదు" అంటూ ధైర్యం చెప్పేరు.

ఆ మాటలు విన్నాక యింత కాళ్ళదగ్గరకొచ్చిన ఉద్యోగాన్ని కాదనలేక పోయేడు రంగయ్య. నెలకింత అని ఖంగుమంటూ జీతం రాళ్ళు చేతుల్లో పడేసే సర్కారు ఉద్యోగాన్ని ఎంత తెలివి తక్కువవాడు మాత్రం వదులుకుంటాడు? పైగా తనకీ ఉద్యోగం దొరికిందంటే రత్తి మూలుగుతూ ముక్కుతూ ఆ యింటా యీ యింటా పాచి పని చెయ్యనక్కర్లేదు. తను ప్రతిరోజూ సూర్యోదయమవగానే ఏం పని దొరుకుతుందా అని నోరు తెరుచుకుని వేచి ఉండనక్కరలేదు. తన నెల జీతంతో తమ యిద్దరి కడుపులు నిండుతయ్. రత్తికి మందూ మాకూ యిప్పించి యింటిదగ్గరే విశ్రాంతిగా ఉండేటట్లు చూడవచ్చు. ఆ ఆశతోనే ఈ ఉద్యోగంలో చేరేడు రంగయ్య. మొదటి నెలజీతం అందుకున్న రోజున తను చేసిన పనిలో పొరపాటేమీ లేదన్న విశ్వాసం దృఢపడింది అతనిలో.

రెండేళ్ళు ఏ చీకూచింతా లేకుండా కొద్దిపాటి ఒడిదుడుకులతో సాగిపోయింది రంగయ్య జీవితం. నెలరోజులక్రితం ఆ జైల్లోకి ఖైదీగా సత్యంవచ్చిన రోజునుండి రంగయ్య మనసు రెప రెపలాడ సాగింది.

అతనికి ఉరిశిక్ష విధించేరట !

అయితే అతను మామూలు ఖైదీకాదు. చాలా ఖరీదైన ఖైదీ. ప్రభుత్వం మూడుసంవత్సరాలనుండి అతనిని గాలిస్తున్నదనీ, అతనిని సజీవంగా పోలీసులకు అప్పజెప్పిన వారికి లక్షరూపాయల బహుమతిని కూడా ప్రకటించిందనీ విని రంగయ్య ఆశ్చర్యపోయేడు. ప్రభుత్వ ప్రకటన విన్నవారికెవరికైనా ఆ నేరస్థుడు ఎంత ప్రమాదకరమైన వ్యక్తో, అతని రూపురేఖలు ఎంత భయంకరంగా ఉంటాయోనన్న ఆలోచన రాక పోదు. కాని అలాటి ఆలోచనలకు విరుద్ధంగా ఎంతో నిర్మలంగా ప్రకాశవంతంగా ఉన్న చిరునగవు ముఖంతో వెలిగిపోయే ఆ పాతికేళ్ళ యువకుడినిచూసి రంగయ్యేకాదు. జైలు అధికారులే ఆశ్చర్యపోయేరు,

"అతను పదిమందిని హత్యచేశాట్ట!" అన్న వార్త విని రంగయ్య మరింత ఆశ్చర్యపోయేడు.

"అబద్ధం నేన్నమ్మను" అన్నాడు అప్రయత్నంగానే.

"అబద్ధమా? ఏది అబద్ధం? అతను పదిమందిని హత్య చేయటమా? లేకపోతే లక్షరూపాయలు ఉరికే ప్రకటించేరాయితనికోసం? ఏం పని లేక ఈ కుర్రాణ్ణి జైల్లో పెట్టేరనుకున్నావా?" అన్నారొకరు.

రంగయ్యకు ఏ సమాధానం చెప్పాలో తెలియలేదు.

కాని ఇంతటిచురుకైన కళ్ళు. యింతటి కాంతివంతమైన ముఖం గల యీ కుర్రవాడు హత్య చేసేడంటే ఎలా నమ్మటం?

"ఇంతకూ ఎవరినో హత్య చేసింది?"

అటూ యిటూ చూసి అతను మెల్లగా చెప్పేడు రంగయ్య చెవిలో "ఈ కుర్రాడిచేతిలో చచ్చిపోయిన వాళ్ళందరూ డబ్బున్న మారాజులేనట" అని.

"డబ్బున్న మారాజునా? వాళ్ళను చంపటం అంత తేలికయిన పనేనా?" గుండెమీద చెయ్యివేసుకున్నాడు రంగయ్య.

"కాదు కాబట్టే యీ కుర్రాడిని అందరూ "గుండెలు తీసినబంటు" అంటున్నారు."

"పాపం వాళ్లు యీ అబ్బాయికిఏమి అన్యాయం చేసేరో యేమో!"

"ఇతనికి వాళ్ళేమి అన్యాయం చెయ్యనూలేదు. వాళ్ల ముఖా లితనికి తెలిసిందీలేదు. ఈతని పేరు వాళ్ళకు తెలియదు. వాళ్ళ సంగతి యీయనకు తెలియదు. అయినా చంపేశాట్ట!"

"ఎందుకో!"

"అదంతా ఓ పెద్ద కథలే! ఈ కుర్రాడికి ఓ పెద్ద గాంగు ఉందట. వాళ్ళ పని పగలల్లా నరమానవుడి కంటబడకుండా బ్రతకటం, రాత్రయే సరికి రోజుకో ఊరిమీద పడి ఊరి పెత్తందార్లందరినీ సఫా చెయ్యటమూ నట. గమ్మత్తేమంటే వీళ్ళు డబ్బున్నవాళ్ళని చంపుతారే తప్ప పేదోళ్ళ జోలికి వచ్చినా పోరట."

ఆ విషయాలు విన్న పది పదిహేను రోజులదాకా రంగయ్యకి మనసులో మనసులేదు.

సత్యం ముఖం చూసి, అతను హంతకుడన్న విషయం విన్నాక ఎంత ఆశ్చర్యపోయేడో అతను చేసిన హత్యల ఉదంతం విన్నాక అంతకు రెట్టింపుగా ఆశ్చర్యపోయేడు

"అతను పేదోళ్ళ జోలికి వచ్చినా పోడట!"

పేదోళ్ళను చూసి జాలిపడే దెవ్వరీ రోజుల్లో? పేదోళ్ళని చూస్తే పెద్దవాళ్ళందరికీ అసహ్యం, కోపం. పేదరికం మహా పాపమైనట్లు, ఆ పేదరికాన్ని అనుభవించే ప్రజలంతా పాపాత్ములైనట్లూ భావించి గొప్పింటి

వాళ్ళంతా తమకి దూరంగా వుంటారు. కుక్కలు, పిల్లులు, నల్లులు, బల్లులు మొదలైన జంతుజాలంవలె పేదవాళ్ళనికూడా ప్రాణికోటిలోని ఒకభాగంగా భావిస్తారేతప్ప వాళ్లా తమలాటి మనుషులేనన్న సమదృష్టితో గౌరవ భావంతో ఎవరూ చూడరు. అవసరమైనపుడు గుర్రాన్ని బండి తోలటానికి, ఎద్లను పొలం దున్నటానికి, కుక్కలను యింటికి కాపలా వుండటానికి, పిల్లుల్ని ఎలుకల్ని చంపటంకోసం పెంచుకున్నట్లు పేద వాళ్ళనుకూడా రిక్షాలు లాగటానికి, ఇళ్ల కట్టించుకోటానికి, పాయిఖానాలు కడగటానికి, చెప్పులు కుట్టించుకోవటానికి, శవాన్ని తగలబెట్టటానికి యిలా రకరకాలుగా ఉపయోగించుకుంటారు డబ్బున్న మారాజులు.

అలా తమ పనులకోసం తోటి మనుషులను ఉపయోగించుకునే గొప్పవాళ్ళకు వీళ్ళమీద దయాదాక్షిణ్యాలు వుండవు సరికదా పైగా కోపం వచ్చినప్పుడు, సక్రమంగా పనిచేయించుకో దలచుకున్నపుడు జంతువులను అదిలించినట్లు వీళ్ళను అదిలించటం, తిట్టటం, కొట్టటం, ఇంకా తిక్క రేగితే చంపెయ్యటంకూడా కద్దు.

అదంతా చూసి చూసి డబున్నవాళ్ల పేదవాళ్లని ద్వేషించటం వాళ్ళ సహజ లక్షణం అన్న అభిప్రాయాన్ని చిన్నతనంలోనే యేర్పరచు కున్నాడు రంగయ్య. అందుకే భాగ్యవంతుల చేతుల్లో నానా రకాలుగా హింసింపబడే తనలాటి పేదవాళ్లు అతని కంటికి వింతగా కనపడేవాళ్ల కారు. అంతేకాదు. పట్టపగలు పదిమందీ చూస్తుండగా నడిరోడ్డుమీద హత్యచేసిన భాగ్యవంతు లెంతమందో జైలు గడప తొక్కకుండా, కోర్టు ఛాయలకు పోకుండా నిశ్చింతగా, కులాసాగా బ్రతకటం తను కళ్లారా చూసేడు.

కాని పాపం యీ కుర్రవాడు గొప్పవాళ్ళను చంపినందుకు జైల్లో పడ్డాడు. రేపో మాపో ఉరితీయబడతాడు కూడాను. అందుకే అన్నారు, భాగ్యవంతుల ప్రాణాలతో ఆడటం, నిప్పుతో చెలగాటంలాటిదేనని.

రంగయ్య పీలుచిక్కినప్పుడల్లా సత్యంతో మాటలు కలపటానికి ప్రయత్నించేవాడు. సాధారణంగా సత్యం ఎవరితోనూ మాట్లాడేవాడుకాదు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ అటూ యిటూ పచార్లు చేస్తుండేవాడు. కాని అతను మాట్లాడటం మొదలెట్టాడంటే ఆ వాగ్ధాటికి అడ్డువుండేది కాదు. ఆవేశంగా అతను మాట్లాడుతుంటే ఉజ్జ్వలంగా ప్రకాశించే అతని కళ్ళవంక రెప్పవాల్చకుండా చూసేవాడు రంగయ్య.

"మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చి పాతిక సంవత్సరాలు దాటుతున్నయ్. కాని బానిసత్వంనుండి బయటపడినందుకు మనకు దక్కిన ఫలితా లేమిటి? ధనవంతులు మరీ ధనవంతులవుతున్నారు. పేదవాళ్ళ స్థితి మరింత దిగజారిపోతోంది. లక్షాధికారులు కోట్లు గడించటానికి, ఒక పూట అన్నం తినేవాడు పస్తులుండటానికీ తప్ప స్వాతంత్ర్యంవల్ల మనకి ఒరిగిందేమీ కనపడటంలేదు. దేశంలో యింతటి అవినీతి, దారిద్ర్యం ఓ పక్కన, సిరిసంపదలు, విలాసాలు మరోపక్కన పెచ్చుపెరిగిపోవటానికి కారణం ఏమిటి? ఇన్ని నదీజలాలు, యిన్ని సారవంతమైన భూములూ వుండగా దేశంలో ఆహార ధాన్యం కొరత ఎలా యేర్పడుతోంది? దేశం పారిశ్రామికంగా యింతటి అభివృద్ధిని పొందుతున్నా, విద్యా వైజ్ఞానిక రంగాలలో ఎంత ముందడుగు వేసినా దేశంలో నిరుద్యోగ సమస్య ఇంతటి తీవ్రరూపం దాల్చటానికి కారకులెవ్వరు? ఈ అవస్థా లన్నిటికీ కారణం ఒక్కటే: దేశ సంపద నంతటినీ కొద్దిమంది స్వార్థపరులు గుప్పెట్లో పెట్టుకుని మిగిలిన కోట్లాది ప్రజలను నానా గడ్డీ కరిపిస్తున్నారు. ధరలు పెరిగినా, నిరుద్యోగ సమస్య రోజుకు పదింతలయినా, ఆకలి చావులు వందలనుండి వేలసంఖ్యలోకి మారినా యీ కొద్దిమంది మారాజులకు చీమ కుట్టినట్లన్నా ఉండదు. పైగా ప్రజలను పీడించటానికి, దోచుకోవటానికి వీరికి మరింత అనువుగా వుంటుంది. అందుకే పరిస్థితులు ఎంతగా విషమిస్తే వారికి అంత లాభదాయకం. ఇలాటి చీడపురుగులను నాశనం చేస్తే

కాని దేశం బాగుపడదు. పుస్తకంలోని ఒక పేజీకి చెదలు పట్టినవంటే ఆ పేజీని చింపి మిగతా పేజీలకు అవి ప్రాకకుండా చూడాలి. అలాగే సమాజంలోని ఒక చిన్న భాగం యిలా అవినీతితో, స్వార్థపరత్వంతో కుళ్ళిపోతుంటే మిగతా సమాజం యొక్క శ్రేయస్సు దృష్ట్యా ఆ కొద్ది భాగాన్ని నిర్మూలించక తప్పదు" అనేవాడు సత్యం.

ఇలా వ్యక్తుల్ని చంపడంవల్లనే కోరుకున్న నవసమాజ స్థాపన జరగగలదని అతనికి తట్టకపోవడం చిత్రం. చెదపట్టిన కాగితాన్ని చింపేస్తే పుస్తకం దక్కొచ్చు. వ్యక్తుల్ని ఏరిపారేసినంత మాత్రాన సామాజిక విప్లవం జరుగుద్దా?

సత్యం మాటలలోని నిజాయితీని మెచ్చుకున్నా అతని మాటలు వింటుంటే రంగయ్య కెందుకో విచారంగా వుండేది. రంగయ్య అక్షర జ్ఞానం లేనివాడేం కాదు. కాస్తో కూస్తో చదువనూ, వ్రాయనూ వచ్చు. పైగా తన చుట్టూవున్న సమాజాన్ని, పరిస్థితులను అర్థం చేసుకోగల తెలివితేటలు, ఊహాబలం కొంతవరకు అతనిలో లేకపోలేదు.

"భాగ్యవంతులు పేదోళ్ళను ప్రేమించటంలేదని యిన్నాళ్ళూ మొత్తుకున్నాం. ఇప్పుడు పేదవాళ్ళుకూడా ధనవంతులను ద్వేషించటం మొదలు పెట్టటంవల్ల లాభం యేముంది బాబూ? ఒకరినొకరు ద్వేషించుకుంటూ రక్తాన్ని చిందించటంవల్ల సమస్యలు తీరిపోతాయా?" అన్నాడు రంగయ్య దిగులుగా.

"సమాజంలో హెచ్చుతగ్గులున్నంతకాలం యీ వర్గద్వేషం, రక్తపాతం తప్పవు. అందుకే వర్గరహితమైన సమాజాన్ని నెలకొల్పటానికి మేమంతా ప్రయత్నం చేసేం. అవసరమైతే రక్తాన్ని బలిగొనటానికి, రక్తాన్ని త్యాగం చెయ్యటానికీకూడా సిద్ధపడ్డాం" అన్నాడు సత్యం.

రంగయ్యకి అతని మాటలు సగం అర్థమయేవి. సగం అర్థమయ్యేవికావు. అతనికి బాగా తెలిసిందల్లా ఒక్కటే విషయం. అదేమిటంటే "యీ సత్యం హత్యలు చేస్తే చేసి ఉండవచ్చు. కాని యేం చేసినా యితను స్వార్థంకోసం స్వప్రయోజనం కోసం చెయ్యలేదు." సమాజం కోసం చేసేడు దేశంకోసం చేసేడు అందుచేత అతనింతటి కఠిన శిక్షకు అర్హుడుకాడు. అతను చేసింది తప్పేకావచ్చు. కాని అతని ఆశయాలలో కల్మషం లేదు, అతనిలో కల్మషంలేదు. అలాటి వాడికి ఉరిశిక్ష ఎందుకు వెయ్యాలి? ఎయిర్ కండిషన్డు రూములలో యీజీఛైరు మీద పడుకొని తమ స్వార్థంకోసం కాలు కదల్చకుండా కనుసైగతోనే ఎన్నో మారణ హోమాలను, హింసాకాండలను జరిపించే అహింసా వాదులకంటే సత్యం ఎన్నో రెట్లు మెరుగు అనుకునేవాడు రంగయ్య.

సత్యం జైలుకి వచ్చిన దగ్గరనుండి ఎంతోమంది అతనిని చూట్టానికి వచ్చేవారు. ఆ వచ్చిన వాళ్ళలో తెలుగు మాట్లాడే వాళ్ళు కొందరు, హిందీ మాట్లాడే వాళ్ళు కొందరు, ఇంగ్లీషు మాట్లాడే వాళ్ళు కొందరు. ఏ భాషలోనయినా అనర్గళంగా, అనాయాసంగా మాట్లాడే సత్యంని చూసి చకితుడయ్యేవాడు రంగయ్య.

వాళ్ళందరూ సత్యంతో ఏదో వాదించేవారు. నచ్చ చెప్పటానికి ప్రయత్నించేవారు. అదేమిటో కొలదిరోజుల తర్వాతగాని తెలియలేదు రంగయ్యకి. అతనికి ఉరిశిక్ష తప్పించేందుకుగాను సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకోమని వాళ్ళు ప్రాధేయపడితే అతను ఒప్పుకొనేవాడుకాడు. చివరికి అతని తరఫున ఒకతను సుప్రీంకోర్టుకు అప్పీలు చేసుకుంటే అతని అభ్యర్థనను త్రోసిపుచ్చింది కోర్టు.

సత్యంకి ఉరిశిక్ష ఖాయమయింది.

అది విని రంగయ్య గుండెలు గుభేలుమన్నయ్. అలా అవటానికి సత్యంకి చావు దాపురించటం ఒకటేకాదు. ఆ చావు తన చేతులమీదుగా

జరగవలసి ఉండటంకూడా కారణమే:

సత్యంకి ఉరిశిక్ష ఖాయమని తేలిన తరువాత అతనిని చూట్టానికి ఎవరు పడితే వాళ్ళు రాకూడదని నిషేధించేరు.

సత్యంని కొద్దిరోజులలో ఉరితీయబోతున్నారన్న వార్త విని చాలా మంది అతనికోసం ఏడ్చేరు. అందులో ఒకతను పక్కనేఉన్నరంగయ్యను నలుగురైదుగురు చప్రాసీలనుచూసి "సత్యం ఎందుకు చచ్చిపోతున్నాడో తెలుసా? మీ కోసం మీలాంటి వాళ్ళకోసం...." అన్నాడు.

ఆ మాట విని అందరూ ఒకరి మొహాలొకరు చూసుకున్నారు. అందరి మనసులూ కలుక్కుమన్నయ్.

సత్యం మాత్రం తనకు మృత్యువు సమీపిస్తున్నందుకు విచారిస్తున్న ఛాయలనేమీ కనపర్చలేదు,

పైగా సంతోషం పడుతున్నట్లుకూడా కనపడాడు. కారణం అతనే చెప్పేడొకసారి. "ఈ స్థితిలో నేను బ్రతికి ఉన్నందువల్ల ప్రయోజనం ఏమీలేదు. పైగా చనిపోవటంవల్ల కొన్ని లాభాలుకూడా ఉన్నయ్. నా మరణ వార్త విని కనీసం కొద్దిమంది ప్రజలలోనయినా చైతన్యంవసే అంతేచాలు....." అన్నాడు.

రోజులు గడుస్తున్నయ్. సత్యంని ఉరితీసే సమయం ఆసన్నమవుతున్న కొలదీ రంగయ్య మనసు నీరసించ సాగింది. శరీరం కంపించ సాగింది.

ఏ క్షణంలోనైనా, ఏ కారణం చేతనైనాసరే యీ ఉరిశిక్ష తప్పిపోతే బాగుండునని కోరుకునే వాడు.

అలా రంగయ్య కలవరపడుతున్నాడే తప్ప సత్యం మాత్రం నిశ్చింతగా కనపడేవాడు.

మృత్యువు ఆగమనం కోసం వేచి ఉన్నట్లు అతనికళ్ళు అనిమిషంగా, తీక్షణంగా చూస్తుండేవి. మూడురోజులలో అతనిని ఉరి తీస్తారనగా సత్యం మాట్లాడటం పూర్తిగా మానివేసేడు భోజనం చేసేవాడు కాదు, ఎటో దూరంగా....అతి దూరంగా, సాధారణ నేత్రాల చూపుకందని ప్రదేశాలలోకి ఎక్కడికో చూస్తుండేవాడు.

అతని ఈ భంగిమని చూసి రంగయ్య నరాలు మరింత బిగుసుకుపోయినయ్. ఒకప్పుడు అగ్నిజ్వాలలు చిమ్మి, యిప్పుడు శీతల హిమాచలం వలె ఘనీభవించుకుపోయిన యీ వ్యక్తిని తన చేతులతో ఎలా చంపటం?

రంగయ్య అవస్థను చూసి రత్తి గుబులుపడింది. వెంటనే తను ధైర్యం తెచ్చుకుని భర్తకు ధైర్యం చెప్పింది. "ఏ డూటీ నువ్వు చేస్తున్నావు. అతనిని చంపాలన్న కోరిక నీకు లేదుకదా. ఐనా చంపటానికి మనం ఎవరం? చంపేవాడు, చంపించేవాడు ఆ భగవంతుడే!" అన్న ధోరణిలో మాట్లాడేది.

కాని ఆ మెట్ట వేదాంతం రంగయ్య మనసును సమాధానపరచేది కాదు. అసలే ఒక నిండుప్రాణాన్ని బలికొనవలసి వస్తోందే అన్న చింత, దానికి తగ్గట్టు సత్యంవంటి నవయువకుడు, ఉత్సాహవంతుడు, ధైర్యశాలి, ఆదర్శశీలి అయిన పురుషుడిని ఉరితీయవలసి వస్తోందని మరింత బెంగ.

చివరికి ఆఖరి రోజు రానే వచ్చింది.

"నీ కిష్టమైన బట్టలు, నీ కిష్టమైన తిండి యేమిటో చెప్పు. తెచ్చి యిస్తాం" అన్నారు జైలు అధికారులు,

దానికి సత్యం నవ్వి "దేశంలో కోట్లాది ప్రజలు కడుపునిండా తిండి లేక, వంటినిండా బట్టలేక దిక్కుమాలిన బ్రతుకు బ్రతుకుతున్నారు. వాళ్ళ కష్టాలు తీరే మార్గాలేవిటో చూడండి, రేపే పాటికి ఈ లోకాన్ని విడిపోయే నా తిండీ బట్టను గురించి మీ కెందుకంత దుగ్ధ?" అన్నాడు.

ఆతని మాటలు వింటుంటే అందరి కళ్ళవెంబడీ నీళ్ళు తిరిగినయ్. ఆ సమయంలో అంత స్వచ్ఛందంగా నవ్వగలిగిన ఆతనివి చూసి ముగ్ధులయ్యేరు.

అక్కడ వున్నవాళ్ళలో కాస్త తల నెరిసిన ఉద్యోగి ఉరిశిక్ష విధింపబడినవారి ప్రవర్తనను గురించి తన అనుభవాలను కొన్నింటిని చెప్పసాగేడు. "ఎంతటి ఉద్దండులయినా, గుండెలు తీసిన బంట్లయినా, ఎన్ని ఖూనీలు చేసినవారైనా తమకి ఉరిశిక్ష ఖాయమని తెలిసేక డీలా పడిపోయేవారు. ఉరితీసేరోజు దగ్గర పడుతున్నకొద్దీ వాళ్ళ శరీరంలో మానసికావస్థలో ఎన్నో విపరీతమైన మార్పులు కనపడేవి. కొందరా ఆలో చనను భరించలేక పిచ్చివాళ్ళయేవారు. కొందరు వెక్కి-వెక్కి ఏడ్చేవాళ్ల. కొందరా వార్త వింటూనే మూర్ఛపోయేవారు. గుండె ఆగి చచ్చిపోయిన కేసులుకూడా ఒకటి, రెండు లేకపోలేదు ఏమైనా తనకు చావు ఖాయమనీ, అందునా ఆ చావు బలవంతాన సంభవిస్తుందనీ తెలుసుకున్న ఏ మనిషీ సహజంగా ఉండలేడు. ఆ పరిస్థితినుండి ఎలాగైనా తప్పించుకు పోదామని ప్రయత్నిస్తాడు. లేదా ఆత్మహత్యకి కూడా పాలుపడతాడు...." ఆ కథలన్నీ వింటుంటే రంగయ్యకి పై ప్రాణాలు పోతున్నట్లుండేది.

"నీవాళ్లెవరైనా ఉన్నారా? ఎవరినైనా చూస్తావా?" అన్న ప్రశ్నకు సత్యం "ఈ దేశ ప్రజలందరూ నావాళ్ళే. పుట్టిన క్షణంనుడి పాతికేళ్ళుగా వాళ్ళ దురవస్థను చూస్తూనే వున్నాను. వాళ్ళకోసం ఏమీ చెయ్యకుండానే, వాళ్ళ దుస్థితిని రూపుమాపకుండానే చనిపోతున్నందుకు నాకు సిగ్గుగావుంది. ఈ అవమానాన్ని నేను భరించలేను. నన్ను వెంటనే ఉరితీయండి. నన్ను చంపండి" అన్నాడు.

ఆ సాయంత్రం వార్డెను రంగయ్యను పిల్చి తాడు, ముసుగు, బల్ల మొదలైన సరంజామా నంతటినీ సిద్ధం చెయ్యమని చెప్పేడు.

"సరిగ్గా తెల్లవారుఝాము నాలుగు గంటలకు అతని ప్రాణం పోవాలి" అని హెచ్చరించేడు.

అప్పటినుండి రంగయ్యకి భయంతో నాలుక పిడచ కట్టుకు పోయింది. రత్తికీ మధ్యనే సుస్తీ చేసింది. అందువల్ల పెందళాడే అన్నం తిని నిద్రపోయింది. కాని రంగయ్య ఆరాత్రి అన్నం తినలేదు. కంటిమీదకు కునుకు రావటంలేదు.

గుడిసె బయట గాఢాంధకారం. తన మనసులోని చీకటికి బయట నున్న ఆ గాఢాంధకారం తోడై అతనిని మరింత భయపెడ్తోంది. అందుకే కిరసనాయిలు బుడ్డిని ఆర్పకుండా, కన్నార్పకుండా గుడిసె మధ్యలో కాళ్లు ముడుచుకుని కూర్చున్నాడు రంగయ్య. మరో రెండు గంటలలో తను ఉరితీసే ప్రదేశానికి వెళ్ళి అన్నీ సిద్ధంచెయ్యాలి. కాని ఎలా వెళ్ళటం? కొద్ది గజాల దూరంలోవున్న జైలు గోడలు అతని కంటికి భయంకరంగా కనపడుతున్నయ్.

ఈ ఆపదనుంచి తప్పించుకోవటానికి ఒక్కటే మార్గం. తనీ ఉద్యోగానికి రాజీనామా యిచ్చెయ్యాలి. కాని ఆ తరువాత జీవితాంతం తను చేసిన పనికి పశ్చాత్తాప పడవలసి వుంటుంది. లేమి యెలాటిదో అనుభవ పూర్వకంగా తనకు తెలుసు. తెలిసి తెలిసి మళ్ళీ దారిద్ర్యాన్ని కొని తెచ్చు కోవటమా? తనొక్కడే కాదుగా ఇలాటి ఉద్యోగం చేస్తున్నది! తనలాటి ఉద్యోగస్థులు ప్రపంచంలో చాలామంది వున్నారు. వాళ్ళందరూ తనలానే బాధపడుతున్నారా? ఒక్కొక్కరి ఉద్యోగాలు ఒక్కో రకంగా ఉంటయ్. రోగి ప్రాణాన్ని కాపాడటానికి డాక్టరు రోగి శరీర భాగాలను కత్తితో కోస్తాడు. అంతమాత్రాన అతనిని హింసాకారుడంటామా? అతనిలో దయాదాక్షిణ్యాలు లేవని అనగలమా? తన సంగతీ అంతే! ఉద్యోగ

ధర్మ నిర్వహణలో తనొక వ్యక్తి మెడకు ఉరితాడును బిగిస్తున్నాడు. అందులో తప్పేమన్నా వుంటే అది తనది కాదు.

అలా మనసు కుదుటపరచుకోవటానికి శాయశక్తులా ప్రయత్నించ సాగాడు రంగయ్య.

*   *   *

చివరికెలాగై తేనేం అన్న టైముకి సిద్ధంచేసేరు. ఏదో అతనికాళూ చేతులూ ఆడుతున్నాయే తప్ప రంగయ్య మనసుమాత్రం శూన్యంగా ఉంది. అతనికి బాహ్యస్పర్శ నశించిపోతున్నట్లు అనుభూతి కలుగుతోంది.

అంతటి వెర్రి భయంలోనూ, అంతటి శీతల గంభీర వాతా వరణంలోకూడా....ఏదో ఒక క్షణంలో యీ ఉరి తప్పిపోతే బాగుండును అన్నకోరిక అతని మనసులో మినుకు మినుకుమంటూనే ఉంది.

సరిగ్గా ఉరి తీసేముందు "అతనిని క్షమించా"నంటూ ప్రెసిడెంటు దగ్గరనుండి ఉత్తరువు రావచ్చు. లేదా అతని మెడకు తగిలించిన ఉరి త్రాడుతో ఏదో లోపం ఉండి సమయానికి పుటుక్కున తెగిపోవచ్చు. హఠాత్తుగా సత్యంకి ఏదో విపరీతమైన జబ్బు వచ్చి అతని ఉరిశిక్ష తేదీ పొడిగింపబడవచ్చు ఇందులో ఏం జరిగినా తనకి పాపం తప్పుతుంది. సత్యం ప్రాణం దక్కుతుంది" అనుకున్నాడు రంగయ్య.

కాని అతననుకున్న దానిలో ఏ ఒకట్టీ జరగలేదు.

సత్యంని ఉరి తీసే ప్రదేశానికి తీసుకు వచ్చేరు.

అతనితోపాటు జైలు వార్డెను, జైలు సూపర్నెంటు, ఒక డాక్టరు, ఒక పోలీసు ఉన్నారు.

వీళ్ళందరి సమక్షంలో రంగయ్య సత్యం మెడకు ఉరిత్రాటిని బిగిం చాలి.

"చివరగా నువ్వు చెప్పదల్చుకున్నదేమయినా ఉన్నదా?" అని సూపర్నెంటు అడిగాడు.

సత్యం తన సహజమైన ధోరణిలో అన్నాడు: "కొద్దిక్షణాలలో నా మెడకు మీరు ఉరి బిగించబోతున్నారు. నా ప్రాణాన్ని తీయబోతున్నారు. కాని మీరు యీ ఉరిని వేస్తున్నది నాకు కాదు. అల్లకల్లోలంగా ఉన్న దేశంలో నిప్పురవ్వల్లా ఎగిరి పడుతున్న వందలాది చైతన్య మూర్తులకు చంపుతున్నది నన్నుకాదు, యుగయుగాలుగా హింసాద్వేషాల వికటాట్ట హాసాల మధ్య హీన స్వరంతో ఎలుగెత్తి చాటుతున్న మానవతని" ఆ సంగతిని మీరందరూ గుర్తుంచుకొండి- అదే నేను చెప్పవలసిందీ, చెప్ప గలిగిందీను" అన్నాడు సత్యం.

"నీ చివరి కోరిక యేమిటి!" అన్న ప్రశ్నకు.

"మనిషిని మనిషిగా చూడాలన్నదే మొదటి కోరికా, ఆఖరి కోరికా కూడాను. హెచ్చు తగ్గులు లేని సామాజిక వ్యవస్థేనా ఆశయం. ఒకరి కోసం ఒకరు పాటుపడే నవ సమాజమే నా సుందర స్వప్నం."

ఆవేశంగా, ఆవేదనగా అతనంటున్న మాటలు అందరి హృద యాలనూ కదిలించి వేసినయ్.

సూపర్నెంటు ఆదేశం ప్రకారం రంగయ్య వణుకుతున్న చేతులతో సత్యం ముఖంమీద నల్లని ముసుగు వెయ్యటానికి అతనిని సమీపించేడు, సత్యం ముఖంమీద ముసుగు వెయ్యబోతూ అతనివంక ఆఖరిసారిగా చూసేడు. సత్యం భావరహితంగా, తీక్షణంగా, సూటిగా రంగయ్య కళ్ళ లోకిచూసేడు, తెల్లగా విశాలంగాఉన్న అతని కళ్ళలోని భావమేమిటో అర్థం చేసుకుందామని అతను ప్రయత్నిస్తుండగానే చటుక్కున అతని చేతులలోని ముసుగు జారి సత్యం ముఖాన్ని కప్పివేసింది.

క్రిందికి దిగివచ్చి ఉరితాడును బిగించి పట్టుకున్నాడు రంగయ్య.

సూపర్నెంటు ఏదో అంటున్నాడు రంగయ్య వంటిమీద స్పృహ లేదు.

గడియారం 'ఠంగు ఠంగు'మంటూ నాలుగు గంటలుకొట్టటం' సూపర్నెంటు 'వన్. టూ. త్రీ—రెడీ....'అనటం, సత్యం మెడకు ఉరి తాడు బిగుసుకు పోవటం, అన్నీ క్షణాల్లో జరిగిపోయినయ్.

సత్యం ప్రాణం గాలిలో కలసిపోయే సమయంలో ఒక భయం కరమైన కేక వినవచ్చింది- ఆ కేకవచ్చింది సత్యం కంఠంనుండి కాదు, రంగయ్య గుండెను చీల్చుకువచ్చింది.

స్పృహతప్పి పడిపోయిన రంగయ్యను జైలు ఆవరణలోకి తీసుకు పోయేరు. డాక్టరు ప్రథమ చికిత్స చేసిన తరువాత తేరుకుని కళ్లు తెరిచేడు రంగయ్య.

ఒక గంట సేపైన తరువాత యిద్దరు పోలీసులు అతనిని వెంట పెట్టుకుని యింటిదగ్గర దించేరు.

అప్పుడు తెల తెల వారుతోంది.

గుడిసెలలోని వాళ్ళందరూ ఎవరి పనులలో వాళ్ళున్నారు.

రత్తి రోజూ అలవాటు ప్రకారం ఈ రోజు పొయ్యిలోకి కావల సిన కట్టెలు, పొయ్యిమీదకు కావలసిన పదార్థాలను తెచ్చుకోవటానికి బజారుకు వెళ్ళింది.

అతనిని దించిన మనుష్యులు వెళ్ళిపోయేరు.

రంగయ్య ఒంటరిగా గుడిసెలో కూర్చున్నాడు. అతని కళ్ళ ముందు ఏవేవో దృశ్యాలు కదులుతున్నయ్. అతని గుండెలో ఏవేవో మాటలు ప్రతి ధ్వనిస్తున్నయ్.

ఉరిత్రాడు....సత్యం చూపు....ఏమిటా చూపులోని భావం? "రంగయ్యా! నేను చచ్చిపోతున్నదెవరికోసమో తెలుసా? నీ కోసం.

నీ లాటి వాళ్ళకోసం" అని ఆ చూపులోని భావం? "ఈ ఉరిని వేస్తున్నది నాకుకాదు. అల్లకల్లోలంగా ఉన్న దేశంలో నిప్పురవ్వల్లా ఎగిరి పడుతున్న వందలాది చైతన్య మూర్తులకు" నల్లముసుగు సత్యం కళ్ళు...."వన్ టూ, త్రీ రెడీ...."కెవ్వున కేక, డాక్టర్....తెల్లకోటు, జైలు వార్డెను, పోలీసులూ, "ఈ దేశ ప్రజలందరూ నా వాళ్ళే....ఈ అవమానాన్ని నేను భరించలేను. నన్ను వెంటనే ఉరి తీయండి!, ఠంగ్ ఠంగ్....ఠంగ్. ఠంగ్! వన్ టూ త్రీ....రెడీ! సమాజంలో హెచ్చు తగ్గులున్నంతకాలం వర్గ ద్వేషం, రక్తపాతం తప్పవు....రక్తం....రక్తం....నల్లనిముసుగు.... ఠంగ్ ఠంగ్! వన్ టూ త్రీ....రెడీ!

"మీరు చంపుతున్నది నన్నుకాదు. యుగయుగాలుగా హింసా ద్వేషాల వికటాట్టహాసాల మధ్య హీన స్వరంతో ఎలుగెత్తి చాటుతున్న మానవతని...."సత్యం కళ్ళు....నల్లముసుగు...."నేను చచ్చిపోతున్నది ఎవరికోసమో తెలుసా? నీ కోసం—నీ లాటి వాళ్ళకోసం....వన్.... టూ....త్రీ....రెడీ!...." ఒక గంట తరువాత బజారునుండి తిరిగివచ్చిన రత్తి, నులక మంచంలో చేష్టలు దక్కి స్థాణువులా పడివున్న రంగయ్యను చూసి స్తంభీభూతురాలైంది.

కథా నిలయం
శ్రీకాకుళం